వాణిజ్య విభాగంలో యువతను ప్రోత్సహించాలి

గన్‌ఫౌండ్రీ: వాణిజ్య విభాగంలో యువతను ప్రోత్సహించాలని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ ఆంథోని సాగయ రాజ అన్నారు. సోమవారం కింగ్‌కోఠిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాలలో వాణిజ్య దినోత్సవ వేడుకలు, మీడియా ఎక్స్‌పో, పరంపర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి యువతరాన్ని వాణిజ్య నాయకులుగా బలమైన వృత్తిపరమైన వేదికలను అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జర్నలిజం కూడా ముద్రణ నుంచి డిజిటల్ రంగం వైపు అడుగులు వేస్తున్నాయన్నారు. వాణిజ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మేళాకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని ఇతర రాష్ట్రాల నుంచి సైతం విద్యార్థులు హాజరు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం చేనేత కళాకారులకు అంకితం చేస్తూ పరంపర పేరిట నిర్వహించిన సాంస్కృతిక కళా ఉత్సవాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన సిబ్బంది గ్లేస్ దిసిల్వ, డాక్టర్ గీతాంజలి, లాస్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

గన్‌ఫౌండ్రీ: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని పుచ్చలపల్లి సుందరయ్య భవన్ కన్వీనర్ మల్లయ్య చారి అన్నారు. ప్రగతి చెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 10, 8 విభాగాలలో బాలబాలికలకు చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చెస్ మాత్రమే కాదని పిల్లల్లో మేధో సంపత్తిని పెంపొందిస్తుందన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయానంద్, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలి

గౌలిపురా: వినాయక చవితిని ఆధ్యాత్మిక జరుపుకోవాలని సాయిదత్త రామానంద గురూజీ అన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి యాకుత్‌పురా నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ పి.రాజేశ్వర్‌రావు అధ్యక్షతన శివ పార్వతీ ఫంక్షన్ హాల్‌లో గౌలిపురా డివిజన్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మండపాల నిర్వాహకులకు వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి కౌడి మహేందర్, సెంట్రల్ కమిటీ సభ్యులు ఆలే భాస్కర్ రాజ్, రూప్‌రాజ్, శ్రీనివాస్, యాకుత్‌పురా అసెంబ్లీ కన్వీనర్ శ్రీనాథ్, కో కన్వీనర్ రాజేశ్, గౌలిపురా కార్పొరేటర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ కబ్జాలపై ఉక్కుపాదం మోపాలి

సుల్తాన్‌బజార్: జీహెచ్‌ఎంసీ సర్కిల్-14 పరిధిలో అక్రమ పార్కింగ్, ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని యాంటికరప్షన్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఉమాప్రకాష్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గన్‌ఫౌండ్రీ, జాంబాగ్ డివిజన్లలోని హనుమాన్‌టేక్డీ, బొగ్గులకుంట, జాంబాగ్ ప్రాంతాల్లో ఉన్న మయూర్ పాన్‌షాప్, నర్సింగ్ చాట్, రాయల్ టిఫిన్‌సెంటర్, ప్రగతి టిఫిన్ సెంటర్ తదితర వ్యాపార సంస్థలు తమ వ్యాపారాల కోసం రోడ్డుపైనే వినియోగదారుల పార్కింగ్ చేయిస్తుండడంతో ఆ రోడ్డున వెళ్లే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా జాంబాగ్ చౌరస్తాలో పూల వ్యాపారులు సైతం ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తుండడంతో దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే చాదర్‌ఘాట్ సిగ్నల్ నుంచి సుల్తాన్‌బజార్ ఉమెన్స్ కళాశాల వరకు వ్యాపారులు రోడ్లపైననే పార్కింగ్ చేస్తుండడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని ట్రాఫిక్ పోలీసులు సైతం దీనిపై దృష్టి సారించి అక్రమ పార్కింగ్‌లపై ఉక్కుపాదం మోపాలని కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

అనుమానం వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు

కాచిగూడ: రైలు ఢీకొని పెయింటర్ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ మలక్‌పేట ప్రాంతానికి చెందిన మహ్మద్ రషీద్ కుమారుడు మహ్మద్ సిరాజ్ (29) మలక్‌పేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నం.1 వద్ద పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. తమ కుమారుడు సిరాజ్ మరణం వెనుక అతని భార్య, బావమర్దుల హస్తం ఉన్నట్లు సిరాజ్ కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సిరాజ్ చనిపోయే ముందు అతడి సెల్‌ఫోన్, అతడి భార్య ఫోన్ స్విచ్ఛాఫ్ ఉందన్నారు. ఇంటికి వెళ్లి చూస్తే తాళం వేసి ఉందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. సిరాజ్ కుటుంబ సభ్యుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. విచారణలో నిజానిజాలు తేలుతాయని ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ వి.లక్ష్మణాచారి కేసు దర్యాప్తు చేస్తున్నారని పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

నల్లకుంటలో మాన్సూన్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

నల్లకుంట: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్ మారుతీదివాకర్ చెప్పారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులను వ్యాప్తి చెందుతాయని అన్నారు. సోమవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని శివానందనగర్‌లో వర్షాకాలం ప్రత్యేక పారిశుద్ధ్య (మాన్సూన్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్) కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ అమృత, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ హేమలతతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ఇళ్లలోని నీటి తొట్టిల, డ్రమ్ములు, పూల కుండీలు, పరిసరాల్లో మురుగు నీరు నిల్వలేకుండా, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఇళ్లలోని నీటు సంపులు, ఓవర్ హెడ్ ట్యాంకులు, డ్రమ్ములలో యాంటీ లార్వా రసాయనాలను పిచికారి చేయించారు.

కుండీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి...

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పరిసరాలు పరిశుభ్రంగా లేకుండా ఈగలు, దోమలు వృద్ధి చెంది డెంగీ, చికున్ గన్యా, టైఫాయిడ్, మలేరియా, డయేరియా లాంటి వ్యాధులు వస్తాయన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతి శుక్రవారం ఇళ్లల్లోని నీటి తొట్టిలు, డ్రమ్ములు, సంపులు శుభ్రం చేసి తడి లేకుండా తుడిచి, ఆరబెట్టి డ్రై డే పాటించాలని ప్రజలకు సూచించారు. అలాగే పూల కుండీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని చెప్పారు.



నీళ్ల డ్రమ్మును పరిశీలిస్తున్న డీసీ మారుతీదివాకర్, కార్పొరేటర్ అమృత, ఏఎంహెచ్ఓ డా. హేమలత

ఎంటమాలజీ సిబ్బంది ఇంటింటికీ వెళ్తారు..

◆ ప్రతి రోజు ఎంటమాలజీ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ నీటి నిల్వలను గుర్తించి, నీటిలో వుండే లార్వాలు (తోకపురుగులు) తొలగించడానికి రసాయనాలు పిచికారి చేస్తున్నారని తెలిపారు. అలాగే ఇళ్లలోని పెద్ద దోమల నియంత్రణకు ఏసీఎం పౌడర్, ఇండోర్ రెసిడ్యూల్ స్ప్రే, డెంట్యూ వ్యాధి వ్యాప్తిని నివారించేందుకు పైరిత్రం రసాయనాలను స్పేస్ స్ప్రే విధానంలో ఎంటమాలజీ నియంత్రణ చర్యలు తీసుకుంటోందని వివరించారు. దోమల నివారణకు ఇంటి కిటికీలు, తలుపులకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



నీటి డ్రమ్ములో యాంటీ లార్వా రసాయనాలు స్ప్రే చేయిస్తున్న డీసీ, కార్పొరేటర్, ఏఎంహెచ్ఓ



అంబర్‌పేట నియోజకవర్గంలో సోమవారం మధ్యాహ్నం మొదలైన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాలాలు పొంగిపొర్లాయి. ముసారంబాగ్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు వెళ్లడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. – అంబర్‌పేట

పెండింగ్ పనులను పూర్తి చేయించండి

చిక్కడపల్లి: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను వెంటనే పూర్తి చేయించాలని నగర కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌కు సోమవారం గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో శానిటైజేషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆయనకు తెలిపారు. వాటర్‌వర్క్స్ వారు ఏర్పాటు చేసిన నూతన సీవరేజీ పైప్‌లైన్ పనులకు అనుకూలంగా రోడ్ల తవ్వకాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై సానుకులంగా స్పందించిన కమిషనర్ సంబంధింత అధికారులను సమన్వయ పరచి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పావని

పైపులైన్ వ్యవస్థను దశలవారీగా ఆధునీకరిస్తాం

అంబర్‌పేట: నియోజకవర్గంలో పైపులైన్ వ్యవస్థను దశలవారీగా ఆధునీకరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం అంబర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో రూ.24 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న తాగు నీటి పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజావసరాలకు అనుగుణంగా పైపులైన్ వ్యవస్థను నిర్మిస్తామన్నారు. శాశ్వత ప్రతిపాదికన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. అలాగే అభివృద్ధి పనులను సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



బాపూనగర్‌లో తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

ఫైన్‌ఆర్ట్స్‌లో అడ్మిషన్లు షురూ

చిక్కడపల్లి: దుర్గాబాయి దేశముఖ్ మహిళా సభ కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ మీడియా ఎడ్యుకేషన్ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల చైర్‌పర్సన్ రమాప్రభ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ కర్ణాటక సంగీతం, ఒక సంవత్సరం కర్ణాటక సంగీతంలో బ్రిడ్జి కోర్సు, ఆరు వారాల సర్టిఫికెట్ సంకీర్తన, సౌందర్యలహరి కోర్సు, వీణ, వయొలిన్, కీబోర్డు, ఫ్లూట్‌లో సర్టిఫికెట్ కోర్సు, క్లాసికల్, ఫోక్‌డాన్స్, రేడియో జాకీ, వాయిస్ ఓవర్ తదితర కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కర్ణాటక సంగీతం కోర్సుకు మహిళలు మాత్రమే అర్హులన్నారు. బీఏ కర్ణాటకలో చేరడానికి ఇంటర్మీడియట్ విద్యార్హత ఉండాలని తెలిపారు. మిగిలిన కోర్సులకు ఎలాంటి విద్యార్హత అవసరం లేదన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.94417 68811లో సంప్రదించాలని తెలిపారు.

'జీఐఎల్‌టీ'లో స్పాట్ అడ్మిషన్స్

రాయదుర్గం: లెదర్ టెక్నాలజీలో తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక పాలిటెక్నిక్ కళాశాలగా గుర్తింపు పొందిన గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ)లో ఖాళీ సీట్ల భర్తీకి శ్రీకారం చుట్టారు. అందుకోసం ప్రత్యేకంగా ప్రభుత్వ ఆదేశం ప్రకారం 'స్పాట్ అడ్మిషన్'ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు జీఐఎల్‌టీ ప్రిన్సిపాల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ సోమవారం తెలిపారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి



ముత్తినేని వీరయ్య

చాదర్‌ఘాట్: దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కన్నా సంవత్సర కాలంలో వికలాంగుల సమగ్ర అభివృద్ధికి పాటు పడ్డామన్నారు. వికలాంగులకు ఉన్నత విద్య, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, కోర్టు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కలిపించామన్నారు. వికలాంగుల కార్పొరేషన్‌లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీలు అందేలా చట్టం చేశామన్నారు. స్పోర్ట్స్ పాలసీ ద్వారా వికలాంగులకు ప్రోత్సహకాలు అందిస్తున్నామని తెలిపారు.

ఫుట్‌పాత్ ఆక్రమణపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తాం

కవాడిగూడ: కవాడిగూడ తాళ్లబస్తీలో ఫుట్‌పాత్‌పై హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని కవాడిగూడకు చెందిన చంద్రప్రకాష్ తెలిపారు. ఫుట్‌పాత్ ఆక్రమించి చేపట్టిన బహుళ అంతస్తుల నిర్మాణంపై పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. అయినా వారు పట్టించుకోవడం లేదని సోమవారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. సంబంధిత శాఖ అధికారుల అండతోనే నిర్మాణం చేపడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

భారత సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన

కాచిగూడ: మన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను నేటి విద్యార్థులకు తెలియజేసేందుకు బర్కత్‌పురలోని శ్రీచైతన్య స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జమ్ము, కాశ్మీర్, పంజాబ్, కేరళ, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, అస్సాం, తమిళనాడు, తెలంగాణ, గోవా, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల వేషధారణలలో అందరిని ఆకట్టుకున్నారు. ఆయా రాష్ట్రాల వేషధారణ, ఆహారం, పండుగలు, పర్యాటక ప్రాంతాలు, దేవాలయాలు, చారిత్రక కట్టడాల నమూనాలను ప్రదర్శించారు. భిన్నత్వంలో ఏకత్వం సారాంశాన్ని విద్యార్థులు అర్థం చేసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ప్రిన్సిపల్ రుబీనా తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయత్రి, సవిత, శ్రీవాణి, డీన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వివిధ రాష్ట్రాల వేషధారణలలో విద్యార్థులు

బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

చిక్కడపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని 'మన ఆలోచన సాధన సమితి(మాస్) రాష్ట్ర కార్యదర్శి నర్సింగ్, ఉపాధ్యక్షురాలు కోరంగి దుర్గారాణి డిమాండ్ చేశారు. సోమవారం గాంధీనగర్ డివిజన్‌లోని వై-జంక్షన్ వద్ద వారు సమితి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఎన్నికల్లో బీసీలకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికి అమలు చేయలేదని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్‌చేశారు. బీసీలను చైతన్య పరిచి రాజ్యాధికారమే లక్ష్యంగా 'మాస్'ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్, ప్రవీణ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రతిపాదికన పనులు పూర్తి చేయించండి

అంబర్‌పేట: బతుకమ్మకుంట – తిలక్‌నగర్ చౌరస్తా మీదుగా వైభవ్‌నగర్ నాలా పనులు చేపట్టారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతోంది. దీంతో సోమవారం అధికారులతో కలిసి బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి పనులను పరిశీలించారు. నాలా పనుల కారణంగా నాలుగు రోజులుగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని అన్నారు. రద్దీ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని అధికారులకు ఆమె సూచించారు.



తిలక్‌నగర్ చౌరస్తాలో నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

విద్యార్థులకు సివిల్ సర్వీస్‌లో ఉచిత కోచింగ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిపాలన శాస్త్ర విభాగం, ఐక్యూఏసీ, కెరీర్ గైడెన్స్ సెల్, కేపీఐఏఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానాచార్యులు డా.కె. ప్రభు అధ్యక్షతన 'సివిల్ సర్వీస్ అండ్ అదర్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్'అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రిసోర్స్ పర్సన్స్‌గా కేపీఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ డా. భవానీశంకర్, డైరెక్టర్ ఎస్.రాజేంద్ర హాజరై కళాశాలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంతా సివిల్స్ ఫౌండేషన్ కోర్సుపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్, డా.ఆర్.లావణ్య, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డా.పి. పద్మజ, కెరీర్ గైడెన్స్ సెల్ కో-ఆర్డినేటర్ డా.బి.శ్రీనివాస్‌గౌడ్, అసోసియేట్ ప్రొ. ఏకు తిరుపతి, డా. అనసూయ, ఆచార్య హరికృష్ణ, డా.నిశ్చల అనితారాణి, ఆచార్య బాణాల శ్రీనివాసరావు, డా.మల్లికార్జున్, డా.వగ్మారే యాదవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌ఏ (ఎఫ్)లకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీహెచ్‌ఏ ఉద్యోగులు

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఎంపీహెచ్ఏ (ఫీమెల్) ఉద్యోగులకు రావాల్సిన స్పెషల్ ప్రమోషనల్ పోస్ట్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యాదనాయక్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు సోమవారం కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమెల్)లకు ఆరు వారాల ఎల్.హెచ్.వి. ట్రైనింగ్ పూర్తి చేయలేదనే కారణంతో 12, 18 ఏళ్ల స్పెషల్ ప్రమోషన్ పోస్టు ఇంక్రిమెంట్ ఇవ్వడం లేదన్నారు. ఫలితంగా 18 ఏళ్ల సర్వీస్ పూర్తయినా పై క్యాడర్‌లో ప్రమోషన్ దొరకకా కనీసం ప్రమోషన్ క్యాడర్ ఇంక్రిమెంట్ లభించక ఎంపీహెచ్ఏ ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ చొరవ తీసుకుని ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ సోమవార పూజలు

నల్లకుంట: పవిత్ర శ్రావణ మాసం రెండో సోమవారం నల్లకుంటలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. న్యూ నల్లకుంటలోని శ్రీ సీతా రామాంజనేయ సరస్వతి దేవాలయంలోని పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర ఆలయంలో ఉదయం శివయ్యకు అభిషేకం చేసి మారేడు దళములతో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సరస్వతి మాతకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాన్ని వితరణ చేశారు.



ఎట్టకేలకు 'సాఫ్'చేశారు..!



సాక్షిలో వచ్చిన కథనం



ఎస్సార్టీలో ప్రొక్లెయినర్‌తో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న సిబ్బంది

చిక్కడపల్లి: 'వీరు మారరు.. వారు పట్టించుకోరు'అనే శీర్షికతో 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి కార్పొరేటర్ పావని స్పందించారు. వెంటనే ఆమె సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్ చెత్తాచెదారం తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ డబ్ల్యూఎఫ్ఏ సిబ్బందితో ఆయన పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డబ్ల్యూఎఫ్ఏ సుధాకర్, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, భరత్, ఎస్సార్టీ క్వార్టర్స్‌వాసులు బాబ్జీ, యాదగిరి, గుర్రం శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ఫీజు విత్‌డ్రా గడువును 23 వరకు పొడిగించాలి

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

కాచిగూడ: రాష్ట్రంలో ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ ద్వారా సీటు పొందిన విద్యార్థులు చెల్లించిన కళాశాలల ఫీజు విత్ డ్రా గడువును ఈనెల 23వ తేదీ వరకు పొడిగించాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌన్సిలింగ్ ద్వారా సీటు పొందిన విద్యార్థులు రూ.లక్షన్నర నుంచి రూ.2లక్షల వరకు ఫీజును చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇదే సమయంలో జాతీయ స్థాయి ఎన్‌ఐటీ, ట్రిపుల్ ఐటీ తదితర కేంద్ర ప్రతిష్టాత్మక సంస్థలో ప్రవేశాల కోసం సెంట్రల్ సీట్ అలోకేషన్ బోర్డు (సీఎస్ఏబీ) కౌన్సిలింగ్‌లో అనేక మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు.

కౌన్సిలింగ్ అవినీతిపై విచారణ జరిపించాలి..

సీఎస్ఏబీ మూడో రౌండ్ సీట్ల కేటాయింపు ఈ నెల 19న జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఇంజినీరింగ్ కళాశాలల ఫీజు విత్ డ్రా గడువును పెంచాలన్నారు. లేకుంటే విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ఇంజినీరింగ్ కౌన్సిలింగ్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సీట్ల కేటాయింపులో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించడం లేదని తెలిపారు. అమ్మాయిల కోటా సీట్లను నిబంధనలకు విరుద్ధంగా అబ్బాయిలకు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడి ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు.

– వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలి

ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఇంజినీరింగ్ కౌన్సిలింగ్‌లో జరుగుతున్న లోటుపాట్లను సరిదిద్దాలన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన కోరారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఆయన కోరారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు నరేష్, కిరణ్, వరుణ్, అర్జున్, గోపి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వేముల రామకృష్ణ